అంతా..మాఇష్టం!

- ఎస్వీయూలో కొనసాగుతున్న ఉద్యోగుల తొలగింపు పర్వం
- ఇప్పటికే 21 మందిని తొలగించిన అధికారులు
- వచ్చేవారంలో మరో 63 మందిపై వేటుకు రంగం సిద్ధం



ఎస్వీయూ ప్రధాన ద్వారం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో అధికారుల పాలన అంతా... మాఇష్టం అనే ధోరణిలో కొనసాగుతోంది. ఇష్టానుసారంగా, ఉన్నఫళంగా తాత్కాలిక ఉద్యోగులపై వేటు వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేరారనే నెపంతో తక్షణం ఉన్నఫళంగా విధుల నుంచి వెళ్లిపోవాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా 21 మందిని తొలగించిన అధికారులు వచ్చేవారంలో మరో 63 మందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఉన్నత విద్యామండలి నుంచి తమకు ఆదేశాలు అందాయని ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఇంతకాలం పనిచేసిన తమను ఏ కారణం లేకుండానే తొలగించడం దారుణమని తాత్కాలిక ఉద్యోగులు వాపోతున్నారు.

అనుచరులకు ఉద్యోగాలివ్వాలనే భారీ స్కెచ్

ప్రస్తుతం ఉన్న తాత్కాలిక ఉద్యోగులను ఎలాగైనా తొలగించి కూటమి ప్రభుత్వంలోని ఓ సామాజిక వర్గానికి చెందిన వారికి ఉద్యోగాలు కల్పించాలనే దురుద్దేశంతో వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారని వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చజరుగుతోంది. ఇందులో భాగంగానే 84 మంది తాత్కాలిక ఉద్యోగులను తొలగించనున్నారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. సుమారు వర్సిటీలో ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే ఉద్యోగులను తొగించకుండా కక్షపూరిత ధోరణితో కొంత మందిపైనే వేటు వేయడం దారుణమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగమ్య గోచరంగా అకడమిక్ కన్సల్టెంట్ల భవితవ్యం

తాత్కాలిక ఉద్యోగుల తొలగింపు పర్వం పూర్తికాగానే అకడమిక్ కన్సల్టెంట్లపై అధికారులు తమ ప్రతాపాన్ని చూపేందుకు స్కెచ్ వేస్తున్నారు. వర్సిటీలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 250 మందికిపైగా అడమిక్ కన్సల్టెంట్లకు సామర్థ్య పరీక్షల పేరుతో ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ఎలాగైనా అకడమిక్ కన్సల్టెంట్లను తొలగించాలనే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఉన్నత విద్యామండలికి పలు రకాల కారణాలు చూపుతూ వారి అనుమతులు పొందే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా వర్సిటీకి సేవలు చేస్తున్న తమకు ఇంటర్వ్యూల పేరుతో డ్రామా ఆడుతూ తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే సర్వీసు పొడిగింపు ప్రక్రియను తొక్కిపెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టును ఆశ్రయించనున్న బాధిత ఉద్యోగులు

ఎస్వీయూలో నిబంధనలకు విరుద్ధంగా తమను తొలగించారని తాత్కాలిక ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు న్యాయవాదులను సంప్రదించి, సలహాలు తీసుకోగా మరింత మందిని తొలిగించిన వెంటనే అంతా ఏకమై న్యాయపోరాటం చేయాలని నిర్ణయించారు. వీరితో పాటు అకడమిక్ కన్సల్టెంట్లు సైతం వర్సిటీ అధికారులు తీసుకునే నిర్ణయాల ఆధారంగా న్యాయపోరాటం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. తాత్కాలిక ఉద్యోగులను తొలగించడం దారుణమని త్వరలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని వామపక్ష, ఉద్యోగ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

పరిసరాల శుభ్రత మన బాధ్యత


బస్టాండ్ వద్ద శుభ్రం చేస్తున్న అధికారులు, కార్మికులు

తిరుపతి రూరల్: ఇంటితో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ ప్రభావతి తెలిపారు. తిరుపతిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీడీ ప్రభావతితో పాటు ఉద్యోగులు, స్కిల్ కళాశాల విద్యార్థినులు చీపుర్లు పట్టి కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ ప్రత్యేక కార్యక్రమాలను అన్ని డీఆర్‌డీఏ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సైతం తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో క్లీనింగ్

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో స్వచ్ఛతా హీసేవా ఉత్సవాల్లో భాగంగా గురువారం క్లీనింగ్ చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు బస్టాండ్‌తో పాటు ప్రాంగణంలో శుభ్రం చేశారు. దుకాణాదారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మీ దుకాణం ముందు ఏర్పాటు డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయించాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పద్మావతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, తిరుపతి కార్పొరేషన్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ సుమతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2న పితృదేవతలకు పిండ ప్రదాన పూజలు


మాట్లాడుతున్న కపిలతీర్థం బ్రాహ్మణ పురోహితుల సేవా సంఘం గౌరవ సలహాదారుడు రాజేష్

తిరుపతి కల్చరల్: భాద్రపద మాసం బహుళ పాడ్యమి నుంచి మహాపక్షాల నేపథ్యంలో చివరి రోజైన అక్టోబర్ 2వ తేదీన అత్యంత పవిత్రమైన మహాలయ అమావాస్య రోజున కపిలతీర్థంలో పిండప్రదాన పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీకపిలతీర్థం బ్రాహ్మణ పురోహితుల సేవాసంఘం గౌరవ సలహాదారుడు సంస్కార్ రాజేష్ తెలిపారు. మహాలయ అమావాస్య నాడు మరణించిన తల్లిదండ్రులు, బంధువులకు పిండ ప్రదాన పూజలు నిర్వహించడం ద్వారా వారి ఆత్మలకు శాంతి కలుగుతుందని తెలిపారు. ఈ మేరకు టీటీడీ ఈఓ శ్యామలరావు అనుమతితో కపిలతీర్థంలో పిండ ప్రదాన పూజలకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో సుమారు 250 మంది బ్రాహ్మణ పురోహితులు పాల్గొని పిండ ప్రదాన పూజలు నిర్వహిస్తారని తెలిపారు. పూజలు చేసుకునే వారి వద్ద నుంచి ఎలాంటి బలవంతపు రుసుము వసూలు చేయడం లేదని, వారి ఇష్టం మేరకు కానుక తీసుకుని పిండ ప్రదాన పూజలు చేస్తామన్నారు. అక్టోబర్ 2వ తేదీ ఉదయం 5 గంటల నుంచి ఈ పిండ ప్రదాన పూజలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో శ్రీకపిలతీర్థం బ్రాహ్మణ పురోహితుల సేవా సంఘం అధ్యక్షుడు అన్నదాన అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ శర్మ, శివానందమూర్తి పాల్గొన్నారు.

తల్లీబిడ్డలకు పునర్జన్మ ఇచ్చేది వైద్యులే



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: తల్లీబిడ్డకు జన్మనిస్తే వైద్యులు వారికి పునర్జన్మ ఇస్తారని, ఆ దిశగా వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ముఖ్య వక్తలు కొనియాడారు. అమెరికాకు చెందిన బ్రైన్ అండ్ హెల్ప్ బేబీస్ ఫౌండేషన్ వారు గత పది రోజులుగా ఎస్వీ మెడికల్ కళాశాలలో చేపట్టిన శిశు సంరక్షణ పద్ధతులపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశం గురువారం ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శ్రీహరిరావు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. తిరుపతిని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. బ్రైన్ అండ్ హెల్ప్ బేబీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాగృతి కార్యక్రమాలు తిరుపతి కేంద్రంగా రాష్ట్రమంతటా వ్యాపించాలని కోరారు. బ్రైన్ అండ్ హెల్ప్ బేబీస్ ఫౌండేషన్ అమెరికా బోర్డు డైరెక్టర్ హరీష్ సింగ్ మాట్లాడుతూ ఎస్వీ మెడికల్ కళాశాలలో నవజాత శిశువుల సంరక్షణపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి డాక్టర్లు అందించిన సహకారం ప్రశంసనీయమన్నారు. తిరుపతి వైద్యకేంద్రంగా భాసిల్లాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో తిరుపతి మెడికల్ కారిడార్ ఏర్పాటు కావాలని సూచించారు. దీనికి ముందు అమెరికా ఇథియోపియాల ప్రాంతం నుంచి విచ్చేసిన డాక్టర్ల బృందానికి ఎంపీ డాక్టర్ గురుమూర్తి రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సురేంద్రబాబు, ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి నరేన్, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ప్రమీల, డాక్టర్ శశికుమార్, డాక్టర్ విజయలక్ష్మి, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన డాక్టర్లు, వైద్యనిపుణులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాజస్థాన్ మంత్రి సంజయ్ శర్మ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

‘అస్వస్థత గురై ఆస్పత్రిలో చేరా’

తిరుపతి క్రైమ్: విధి నిర్వహణలో ఉండగా ఈనెల 24వ తేదీ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరానని ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ఒక వీడియో విడుదల చేశారు. అనారోగ్యం కారణంగానే ఆస్పత్రిలో చేరానని, ఇదే క్రమంలో సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందని తెలిపారు. అనంతరం ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేశానన్నారు. ఇదే క్రమంలో పేపర్లు, టీవీలలో వివిధ రకాల వార్తలు వచ్చాయని, అవన్నీ అవాస్తవాలని తెలిపారు. తనపై అధికారుల ఒత్తిడి లేదన్నారు. ఇదే క్రమంలో తనకు ట్రాన్స్‌ఫర్ వచ్చిందని, ఈ విషయంలో కూడా రకరకాల వదంతులు వస్తున్నాయని అవి అవాస్తవాలే అని తెలిపారు. జనరల్ ట్రాన్స్‌ఫర్ల ద్వారానే తనకు బదిలీ వచ్చిందన్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి


సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

పాకాల : తమబిడ్డల అభివృద్ధికి తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి తెలిపారు. గురువారం స్థానిక కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంటి వద్ద విద్యార్థులు ఎంత సమయం చదువుతున్నారు? సమయానికి ఇంటికి వస్తున్నారా ? లేదా అనే విషయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. తద్వారా వారు చెడుదారిలో పడే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. అధ్యాపకులు కళాశాలల్లో మాత్రమే విద్యార్థులను పరిశీలించగలరని, ఇంటి వద్ద మాత్రం తల్లిదండ్రులే పిల్లలపై శ్రద్ధ వహించాలన్నారు. అలాగే విద్యార్థుల పరీక్షా ఫలితాలు, వారి హాజరు శాతాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఎస్.జయచంద్ర, ఎం.వి.యర్రయ్య, హరినాథ్‌ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

తిరుపతి తుడా: నగర పరిశుభ్రతకు అహర్నిశలు పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి, వారి ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ సహకరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఇండోర్ స్టేడియంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు, పీపీఈ కిట్లను ఎమ్మెల్యే, కమిషనర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరం పరిశుభ్రంగా ఉందంటే కారణం పారిశుద్ధ్య కార్మికుల నిరంతరం కృషి అన్నారు. వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామన్నారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ నగర పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీ విజయలక్ష్మికి సన్మానం


ఏపీపీ విజయలక్ష్మిని సన్మానిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)విజయలక్ష్మిని ఉమ్మడి చిత్తూరు జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గురువారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇటీవల ఏపీపీ విజయలక్ష్మిని తిరుపతి నుంచి నెల్లూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీపై వెళుతున్న నేపథ్యంలో ఆమెను జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తిరుపతిలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆమెను శాలువతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి కోటేశ్వర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉమాదేవి, ప్రేమ్సాగర్, జయశేఖర్, నిర్మల, జిల్లా మాజీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా

తిరుపతి(అలిపిరి): ప్రజల సమస్యలు పరిష్కరించి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎంఆర్‌పల్లిలో కమిషనర్ మౌర్య అధ్యక్షతన ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ వంద రోజుల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేసిన ఎన్నికల హామీలను ప్రజలకు వివరించారు. కార్పొరేషన్ పరిధిలో మూడు పథకాలను అమలు చేసినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేస్ట్ టు ఆర్ట్ ప్రదర్శనలు


ప్రదర్శనలను తిలకిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్, వేస్ట్ టు వండర్ పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని పనికిరాని వాటితో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించామన్నారు. చెత్తను వేరు చేసి తమ సిబ్బందికి ఇస్తే వాటిని రీసైకిల్ చేసేందుకు వీలుంటుందన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు పూర్తిగా తగ్గించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, మస్తాన్, విద్యార్థులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డిక్లరేషన్‌లో సంతకం చేయాలి

తిరుపతి(అలిపిరి): అలిపిరి పాదాల మండపం వద్దనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిక్లరేషన్‌పై సంతకం చేస్తేనే తిరుమలకు అనుమతిస్తామని.. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక టీటీడీ పరిపాలన భవనం ఎదుట మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సామంచి శ్రీనివాసులు, అజయ్ కుమార్, వరప్రసాద్, మల్లకుప్పం శేఖర్, పెనుబాల చంద్రశేఖర్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3కె రన్


తిరుపతిలో 3కే రన్‌లో పాల్గొన్న యువకులు, విద్యార్థులు

తిరుపతి తుడా: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించిన 3కె రన్ ఉత్సాహంగా సాగింది. ఈ 3కె రన్‌ను గురువారం ఉదయం వివేకానంద కూడలి వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య జెండా ఊపి ప్రారంభించారు. వివేకానంద కూడలి నుంచి ప్రారంభమైన టౌన్ క్లబ్, బాలాజీ కాలనీ మీదుగా ఎస్.వి.యూనివర్సిటీ వరకు ఈ 3కె రన్‌లో యువకులు, విద్యార్థులు, పిల్లలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సిటీజెన్ సీఈవో మురళీకృష్ణ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ మేనేజర్ సయ్యద్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం కల్పించాలి


ఓపెన్ స్కూల్ వివరాలను తెలియజేస్తున్న అధికారులు

చంద్రగిరి: అనివార్య కారణాల వల్ల మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్‌లో పదో తరగతిలో ప్రవేశం కల్పించాలని ఓపెన్ స్కూల్ తిరుపతి జిల్లా రాష్ట్ర కో-ఆర్డినేటర్ నాగేందర్ రావు అన్నారు. గురువారం తిరుచానూరు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎప్పుడో మానివేసిన చదువును కొనసాగించడానికి ఓపెన్ స్కూల్ చక్కటి అవకాశం కల్పించిందని చెప్పారు. 14 ఏళ్లు పూర్తయిన వారు పదో తరగతి, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ ద్వారా చదవవచ్చని తెలిపారు. ఈ సందర్భనలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ గురుస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖను ప్రక్షాళన చేయాలి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దళిత, ఆదివాసి, ఇతర పేద విద్యార్థులు చదివే లక్ష్యంగా సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో చేరుతున్న విద్యార్థులకు సరైన వసతులు లేక విద్యకు దూరమవుతున్న నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖను ప్రక్షాళన చేయాలని ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో 60 శాతంగా ఉన్న హాస్టల్ విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 40 శాతానికి పడిపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే సాంఘిక సంక్షేమ శాఖను ప్రక్షాళన చేసి రుచికరమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుని సమీక్ష నిర్వహించాలన్నారు. ఇటీవల అనేక సంక్షేమ హాస్టళ్లలో కల్తీ సరుకులు కారణంగా వందలాది మంది విద్యార్థులు కలుషిత ఆహారం తినడంతో హాస్పిటల్ పాలయ్యారని గుర్తు చేశారు. ఇటీవల నాయుడుపేట గురుకుల పాఠశాల, నిన్న విజయనగరం జిల్లా ఎస్.కోట సంక్షేమ హాస్టల్ విద్యార్థులు హాస్పిటల్ పాలయ్యారని గుర్తు చేశారు. తక్షణం నిధులు విడుదల చేయడంతో పాటు రాష్ట్రంలో ప్రస్తుత ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్‌లు చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో అనేక రంగాల్లో పని చేస్తున్న హమాలీ కార్మికులు నిరంతరం శ్రమజీవనం గడుపుతున్నారని, వారి సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వం హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో గురువారం హమాలీ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. చాలీచాలనీ వేతనాలతో కష్టపడుతున్న కార్మికులకు సంక్షేమబోర్డు ఎంతో అవసరమన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి తద్వారా ప్రమాదవశాత్తు హమాలీ చనిపోతే ఐదు లక్షలు కార్మిక కుటుంబానికి అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొంత ఇంటి స్థలాలు లేని కార్మికులకు ఇంటి స్థలాలు కల్పించాలని ఆదుకోవాలన్నారు. హమాలీలు పని చేసే స్థలంలో వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా షాపుల యాజమాన్యాలతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు రాధాకృష్ణ, విశ్వనాథ్, బాబు, మునికృష్ణ, నాగరాజు, హరిదాసు, వెంకటేష్, సురేష్, అనిల్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

మహాకవి జాషువా


గుర్రం జాషువాకు నివాళులు అర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు

తిరుపతి కల్చరల్: అంటరానితనానికి అడ్డుకట్ట వేసి మానవత్వాన్ని ప్రబోధించిన మహాకవి గుర్రం జాషువా అని రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి కొనియాడారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రంగస్థలి కార్యదర్శి కేఎస్ రాజా, సుబ్రమణ్యం రెడ్డి, సురేష్ స్వామి, బాబు, ఈశ్వరి, నరసింహారెడ్డి, వేణుగోపాల్, శివప్రసాద్, కళాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ


దసరా నవరాత్రి ఉత్సవాల పోస్టరును ఆవిష్కరణలో ప్రతాప్ స్వామిజీ

రామచంద్రాపురం: మండలంలోని సూరావారిపల్లి సమీపంలోని గొల్లపల్లిలో ఉన్న సురభి గోసంరక్షణ శాలలో అక్టోబర్ 3వ తేదీ నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామిజీ తెలిపారు. గురువారం స్థానిక మీడియా కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయనున్నట్లు వివరించారు. 12వ తేదీన లోక కల్యాణార్థం కాళీ కాలభైరవ కల్యాణం జరపనున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాల్లో భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. అనంతరం దసరా ఉత్సవాల పోస్టరును ఆవిష్కరించారు.

టీటీడీ ఈఓతో కేఎంఎఫ్ ప్రతినిధులు భేటీ


టీటీడీ ఈఓను మర్యాద పూర్వకంగా కలిసిన కేఎంఎఫ్ ప్రతినిధులు

తిరుపతి(అలిపిరి): కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (నందిని డెయిరీ) ప్రతినిధులు గురువారం టీటీడీ ఈఓ జె.శ్యామలరావును మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని ఈఓ కార్యాలయంలో కేఎంఎఫ్ ప్రతినిధులు నందిని డెయిరీ ఉత్పత్తులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ద్వారా ఈఓకు వివరించారు. సమావేశంలో టీటీడీ జేఈఓ గౌతమి, కేఎంఎఫ్ ఎండీ ఎంకే జగదీష్, డైరెక్టర్లు రఘునందన్, రాజశేఖర్ మూర్తి, మంజునాథ్ పాల్గొన్నారు.

ఈస్ట్ సీఐగా శ్రీనివాసులు


సీఐ శ్రీనివాసులు

తిరుపతి క్రైమ్: తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మహేశ్వర్ రెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆస్థానంలో శ్రీనివాసులు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ తమవంతు కృషి చేస్తానన్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం అందుబాటులోఉంటానని తెలిపారు.

ఆర్సీపురం డీటీగా అన్వర్‌బాషా


అన్వర్‌బాషా

రామచంద్రాపురం: మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్‌గా అన్వర్‌బాషా గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. చిన్నగొట్టిగల్లు మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న పునీతారాణి శ్రీకాళహస్తి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అలాగే మండల సర్వేయర్‌గా రమేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అన్వర్‌బాషా, రమేష్ బాషాలను ఆఫీసు సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి ఘనస్వాగతం పలికారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


మృతి చెందిన సరిత

బంగారుపాళెం: తిరుపతిలో స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఓ మహిళ మృతి చెందినట్లు ఏఎస్ఐ రామచంద్రారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని చంద్రశేఖరపురానికి చెందిన ఉదయ్‌కుమార్ భార్య సరిత(38) గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆరోగ్యం నయం అవుతుందో కాదోనని జీవితంపై విరక్తి చెంది ఈ నెల 23వ తేదీ వడిశాకు తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మార్కెట్‌లోకి ఎంజీ విండ్సర్ ఎలక్ట్రికల్ వాహనం



తిరుపతి కల్చరల్: చెన్నై-బెంగళూరు బైపాస్ రోడ్డులోని కెస్విన్ ఆటోమోటార్స్ షోరూంలో గురువారం సాయంత్రం జీఎం వారి విండ్సర్ ఎలక్ట్రికల్ కారును ఆర్టీఓ మురళీమోహన్ చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూం అధినేత ఆర్.ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సరికొత్త వాహనానికి జీవితకాలం బ్యాటరీ వారెంటీ ఉందని, ఏడాది ఫ్రీ చార్జింగ్ ఉంటుందని తెలిపారు. అలాగే అత్యాధునిక ఫీచర్లతో రెడ్, ఎల్లో, ఆరెంజ్ కలర్లలో సీట్ 185 డిగ్రీ రిక్లెయిన్, ఇన్ ఫినిటీ వ్యూ గ్లాస్ రూఫ్ ఫీచర్స్ కలిగి ఉందని తెలిపారు. ఒక్కసారి ఛార్జింగ్‌తో 331 కిలోమీటర్లు నడుస్తుందని, దీని ధర రూ.9.99 లక్షల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో షోరూం ఈడీ చందన్, సీఈఓ మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.